హెచ్‌సీయూ విద్యార్థికి అరుదైన అవకాశం

సెంట్రల్‌ విశ్వవిద్యాలయాల ఏబీవీపీ జాతీయ కన్వీనర్‌గా కనుకాటి బాలకృష్ణ ఎన్నిక


బాలకృష్ణ

రాయదుర్గం: తెలంగాణకు చెందిన హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. నల్గొండ జిల్లా చింతపట్టి మండలంలోని బద్దమవరిగూడెం గ్రామానికి చెందిన కనుకాటి బాలకృష్ణ ఉత్తరప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ సమావేశాల్లో ఏబీవీపీ కేంద్ర విశ్వవిద్యాలయాల కార్యాలయాల జాతీయ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. బాలకృష్ణ ప్రస్తుతం గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీలో జర్నలిజంలో పీహెచ్‌డీ (పరిశోధక విద్యార్థి)గా చేస్తూ హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సెంట్రల్‌ యూనివర్శిటీల్లో ఏబీవీపీ కార్యకలాపాలను సమన్వయం చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా సెంట్రల్‌ యూనివర్శిటీల జాతీయ కన్వీనర్‌గా బాలకృష్ణకు అవకాశం రావడంపై హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు ఆయనను అభినందించారు. జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చేలా పని చేయాలని వారు ఆకాంక్షించారు.

డిసెంబర్‌ 6 నుంచి బాలోత్సవం పేరిట పోటీలు


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్‌ రఘునందన్‌ తదితరులు

గచ్చిబౌలి: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు డిసెంబర్‌ 6,7 తేదీల్లో బాలోత్సవం పేరిట వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్‌ రఘునందన్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల జాతర ఉంటుందన్నారు. వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్‌, డ్రాయింగ్‌, ఫోక్‌ గ్రూప్‌ డ్యాన్స్‌, సాంగ్స్‌, సోలో సింగింగ్‌, డ్రామా స్కిట్‌ తదితర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్‌ సభ్యులు ఆర్‌.సాంబశివరావు, బాలోత్సవం కన్వీనర్‌ విజయ్‌ కుమార్‌, సభ్యులు రవీందర్‌, కుర్ర అనిల్‌, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు అండగా సందయ్య ట్రస్ట్‌


విద్యార్థులకు నోట్‌ బుక్స్‌ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్‌, రవికుమార్‌ యాదవ్‌

చందానగర్‌: నిరుపేద విద్యార్థులకు సందయ్య మెమోరియల్‌ ట్రస్ట్‌ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్‌ పేర్కొన్నారు. చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్‌ విద్యార్థులకు ట్రస్ట్‌ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్‌ ఎమ్మెల్యే, ట్రస్ట్‌ సెక్రటరీ రవికుమార్‌ యాదవ్‌తో కలిసి సోమవారం విద్యార్థులకు ఉచితంగా నోట్‌ బుక్స్‌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేటా ట్రస్ట్‌ ద్వారా వందలాది మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌ బుక్స్‌ అందిస్తున్నామన్నారు. విద్యార్థులంతా లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరేంద్ర ప్రసాద్‌, నవతారెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్‌, రాజు శెట్టి, రామచందర్‌, వెంకటస్వామి రెడ్డి, రమణయ్య, శ్రీనివాస్‌ యాదవ్‌, సీతారామరాజు, రాజేశ్‌, సత్యనారాయణ రాజు, క్రాంతి, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై ఆరా

కొడకంచి పాఠశాలను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం


కొడకంచి ప్రభుత్వ పాఠశాలలో ట్రైనీ ఐఏఎస్‌లు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో ఐదుగురు ట్రైనీ ఐఏఎస్‌ అధికారులు సోమవారం పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిపాలన అంశాల్లో భాగంగా విద్యాపరమైన అంశాలు మౌలిక వసతులు సమస్యలు బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించిన ఐఏఎస్‌ బృందం సభ్యులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమావతి, ఉపాధ్యాయులు మొగిలి మాల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి


చెరువులో చేప పిల్లలు వదులుతున్న కార్పొరేటర్‌, మత్స్యశాఖ జిల్లా అధికారి


చేప పిల్లలను వదులుతున్న పుష్ప

పటాన్‌చెరు టౌన్‌: మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం డివిజన్‌ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువుల్లోకి 86 వేల చేప పిల్లలను కుమార్‌యాదవ్‌, మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావుతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని సాకి చెరువులో 61 వేలు, తిమ్మక్క చెరువులో 25 వేల వివిధ రకాల చేపలను వదలామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు, కుమార్‌ ముదిరాజ్‌, నాయకులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువులో..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రామచంద్రాపురం కార్పొరేటర్‌ పుష్ప పేర్కొన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువులో 38వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువులకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు.

సొంత ఖర్చులతో బోర్‌ ఏర్పాటు


బోర్‌ పనులు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): అయ్యప్ప దీక్షలు చేపట్టిన స్వాములకు బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి అండగా నిలిచారు. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని శివాలయ సన్నిధానంలో అయ్యప్ప స్వాముల కోసం సొంత ఖర్చులతో బోర్‌ మోటారు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాముల దీక్షతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని సంతోషం వ్యక్తం చేశారు. స్వాములకు నీటి సమస్య రావొద్దని పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి నాయకులు శ్రీనివాస్‌ రెడ్డి రాజు మల్లేష్‌ గౌడ్‌ వెంకటేష్‌ గౌడ్‌, శ్రీకాంత్‌ రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, బాల్‌రెడ్డి అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో భక్తులు..


ఇందిరానగర్‌లోని ఐఎస్‌హెచ్‌డీఏ ఆలయంలో ..

కార్తీక సోమవారం పురస్కరించుకుని ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. అదేవిధంగా గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీవిశ్వేశ్వరస్వామి, టెలీకాంనగర్‌లోని సాయిదత్తగణపతి, సాయిఐశ్వర్యకాలనీ శివాలయం, గౌలిదొడ్డిలోని శివాలయంలోనూ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. – రాయదుర్గం


చంద్రమౌళీశ్వరస్వామి..

27న నిధి ఆప్కే నికత్‌ 2.0

పటాన్‌చెరు టౌన్‌: సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న నిధి ఆప్కే నికత్‌ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ సోమవారం ఎ ప్రకటనలో పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని అంబేడ్కర్‌ కాలనీ, సదాశివపేట్‌ అయ్యప్పస్వామి దేవస్థానం సమీపంలోని సెయింట్‌ మేరీస్‌ హైస్కూల్‌, పాశమైలారం మెటల్‌ క్రాఫ్ట్‌ ఫోమింగ్‌ ఇండస్ట్రీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌లో ఉదయం. 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు

ఇంద్రేశం కార్యదర్శి సుభాష్‌


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్‌: కూల్చివేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్‌ హెచ్చరించారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి నిర్మాణాలు చేస్తుండడంతో నోటీసులు జారీ చేశారు. అయినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో సోమవారం కూల్చివేసినట్లు కార్యదర్శి సుభాష్‌ తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ఆలయాల నిర్మాణాలకు సహకారం

పటాన్‌చెరు టౌన్‌: నూతన ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పటేల్‌ గూడ సిద్ధార్థ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కట్ట మైసమ్మ దేవాలయం పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవచింతన ద్వారా మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్‌ డివిజన్‌కు చెందిన ఈ. సాయిరామ్‌కు రూ. 75 వేల సీఎంఆర్‌ఎఫ్‌ ఆర్థిక సాయం మంజూరైంది. కాగా చెక్కును సోమవారం ఎమ్మెల్యే కృష్ణారావు లబ్ధిదారుడికి అందజేశారు.

ఓయూకు గ్రూప్‌-4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్‌–4 ఎంపికైన ఉద్యోగుల్లో 375 మంది ఓయూకు రానున్నారు. యూనివర్సిటీ చరిత్రలో నాన్‌టీచింగ్‌ ఉద్యోగులను తొలిసారి గ్రూప్‌–4 ఎంపికైన ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. ఇదివరకు నాన్‌టీచింగ్‌ ఉద్యోగాలను ఓయూ అధికారులు నియమించారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల నిబంధనలు మార్చింది. దీంతో గత 26 సంవత్సరాలుగా ఓయూలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. గ్రూప్‌–4 ఉద్యోగుల రాకతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారేమోనన్న గుబులు కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొత్తగా మొదలైంది. కొత్తగా వీసీ ప్రొ.కుమార్‌ ఓయూ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మనెంట్‌ చేయాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

శ్రీరాంనగర్‌ ఫీడర్‌ పరిధిలో..

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌, కిన్నెర హోటల్‌, గంగారం, శ్రీరాంనగర్‌ ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని తెలిపారు.

చందానగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

మదీనాగూడ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఆర్టీసీ కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మదీనాగూడ, ల్యాండ్‌మార్క్‌ అపార్ట్‌మెంట్స్‌, కల్కి అపార్ట్‌మెంట్స్‌, ఆర్టీసీ కాలనీ, మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

తారానగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

తారానగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుమన్‌ తెలిపారు. హుడా కాలనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హుడా కాలనీ, జాకబ్‌ బేకరీ ఏరియా, వాటర్‌ ట్యాంక్‌, పార్క్‌ వెనకాల వైపు, ఎంఎంటీఎస్‌ స్టేషన్‌ రోడ్డు, ఆర్‌ఎస్‌ బ్రదర్స్‌ మెయిన్‌ రోడ్డు ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గోల్డెన్‌ తులీప్‌ ఫీడర్‌ పరిధిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొండాపూర్‌ ఏఈ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోల్డెన్‌ తులీప్‌ ఫీడర్‌ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ ఏ,బీ బ్లాక్‌, గోల్డెన్‌ తులీప్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పలు కాలనీల్లో..

మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్‌ తెలిపారు. సాయిఐశ్వర్య కాలనీ, ల్యాంకోహిల్స్‌, జైన్‌ హౌసింగ్‌, ఖాజాగూడ, చిత్రపురి కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

సగరుల అభ్యున్నతికి నిరంతర కృషి


హాజరైన మహిళలతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: సగరుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వేంకటేశ్వర నగర్‌లోని సగర సంఘం కమ్యూనిటీ హాల్‌ మొదటి అంతస్తు భవనాన్ని కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాలు, అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. కుట్టు శిక్షణ కేంద్రానికి కుట్టు మిషన్లు ఇవ్వాలని సగర సంఘం మహిళలు ఎమ్మెల్యేను అభ్యర్థించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా సగర మహిళా భవనం నిర్మాణానికి తనవంతూ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సగర ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ ఆస్కానీ మారుతీసాగర్‌, జగద్గిరిగుట్ట సగర సంఘం అధ్యక్షుడు ఆస్కానీ కొండయ్య సాగర్‌, జగద్గిరిగుట్ట సగర సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కానీ శ్రీనివాస్‌ సగర్‌, కోశాధికారి కొమ్ముల రాజేశ్‌ సగర్‌, సగర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా..

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు ఎంతో ఆర్థిక భరోసా లభిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రూ.71 వేల విలువైన చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌, ప్రసాద్‌, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

జిన్నారం (పటాన్‌చెరు): మారుమూల గ్రామాల నుంచి కళాశాల స్థాయిలో చదువుకునే విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమ వారం జీడిమెట్ల డిపో మేనేజర్‌ను స్థానిక నాయకులతో కలిసి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు రవాణా సేవ లను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బొంతపల్లి వరకు నడుస్తున్న ఆర్టీసీ ఆర్డినరీ బస్సులను గుమ్మడిదల మండల కేంద్రం వరకు పొడిగించాలన్నారు. నాయకుల విజ్ఞప్తికి మేనేజర్‌ స్పందించి త్వరలోనే బస్సులను పొడిగిస్తామని హామీ ఇచ్చారు.

పైపులైన్‌ ధ్వంసమై తాగునీరు వృథా..!

శేరిలింగంపల్లి: లింగంపల్లి నుంచి నల్లగండ్ల వైపు సరఫరా చేసే పైపులైన్‌ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. ఆదివారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌ ఒకటో ప్లాట్‌ఫాం వైపు రోడ్డును రైల్వే అధికారులు పొక్లెయిన్‌తో క్లీనింగ్‌ చేస్తుండగా 200 డయా పైప్‌లైన్‌కు తగిలి ధ్వంసమైంది. దీంతో తాగునీరంతా వృథాగా అక్కడే ఉన్న నాలాలోకి వెళ్లింది. వాటర్‌ వర్క్స్‌ అధికారులు స్పందించి సోమవారం వాటికి మరమ్మతులు చేపట్టారు.


వృథాగా పారుతున్న తాగునీరు

నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో. టమాట రూ. 40, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 60, క్యాప్సికం 60, క్యాబేజీ 40, క్యారెట్‌ 70, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40 , క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 400.

ప్రజావాణికి 6 ఫిర్యాదులు


ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఇంజినీరింగ్‌, టౌన్‌ప్లానింగ్‌, రెవెన్యూ, అర్బన్‌ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. టౌన్‌ ప్లానింగ్‌ సెక్షన్‌ సంబంధించి 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏఎంసీలు ప్రేమ్‌కుమార్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ సర్కిల్‌ మేనేజర్‌ యూసుఫ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో..

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో ఉపకమిషనర్‌ మోహన్‌ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్‌ విభాగానికి సంబంధించిన ఒక ఫిర్యాదు రాగా పరిష్కరించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.

యువకుడి అదృశ్యం


కౌశిక్‌రెడ్డి

మియాపూర్‌: యువకుడు అదృశ్యమైన ఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండకు చెందిన ఆదిరెడ్డి, కల్పన దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మియాపూర్‌లోని నాగార్జున ఎన్‌క్లేవ్‌ కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు కట్ట కౌశిక్‌ రెడ్డి (21) స్థానికంగా బీటెక్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండేళ్లుగా గేమ్స్‌ ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి 2 నెలల కింద గేమ్స్‌ మాన్పించేందుకు రీహబ్లీటేషన్‌ సెంటర్‌లో చేర్పించారు. తర్వాత కొన్ని రోజుల పాటు గేమ్స్‌ ఆడడం ఆపాడు. మళ్లీ తల్లిదండ్రులకు తెలియకుండా గేమ్స్‌ ఆడడం మొదలు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కౌశిక్‌ను మందలించారు. ఈ నెల 19న ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల దగ్గర గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన తల్లి కల్పన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు ప్రైవేట్‌ ఆస్పత్రుల సీజ్‌

జిన్నారం (పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్‌ ఆసుపత్రులపై వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు. ఈ సందర్భంగా ఐదు ఆస్పత్రులను సీజ్‌ చేశారు. సోమవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బీపీఎల్‌ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి ఆదేశాల మేరకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి మధుకర్‌ తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ కేంద్రాల్లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. అలా కాకుండా ఆపరేషన్లు నిర్వహిస్తున్న వాటిపై విచారణ జరిపి చర్యలు చేపట్టారు. ఈ నిబంధనలు ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయన్నారు.

బీకేఎంయూ రాష్ట్ర సమావేశాలు విజయవంతం చేయాలి

శంషాబాద్‌: శంషాబాద్‌లో డిసెంబర్‌ 7, 8వ తేదీల్లో నిర్వహించనున్న బీకేఎంయూ రాష్ట్ర కౌన్సిల్‌ సమావేశాలను విజయవతం చేయాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌ విగ్రహం వద్ద కౌన్సిల్‌ సమావేశాలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పేరిట వేలాది ఎకరాల వ్యవసాయ భూములను పరిశ్రమల యజమానులు, రియల్‌ ఎస్టేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సదస్సుకు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, పౌరహక్కుల నేత ప్రొఫెసర్‌ హరగోపాల్‌ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నేతలు పుస్తకాల నర్సింగ్‌ రావు, జంగయ్య, అంజయ్య, కృష్ణ, స్వరూప, నరసింహ, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ శ్రీ వివేకానందనగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాస్‌రావు సంఘం సభ్యులతో కలిసి సోమవారం పలు సమస్యలపై కార్పొరేటర్‌ సబిహా బేగంకు వినతి పత్రం అందజేశారు. సీసీ రోడ్లు, విద్యుత్‌ దీపాలు, కమ్యూనిటీ హాల్‌ అదనపు ఫ్లోర్‌, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌ పోల్స్‌ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మధు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్లను బాగు చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

పటాన్‌చెరు టౌన్‌: ప్రభుత్వాలు మారినా రోడ్ల దుస్థితి మారడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మండిపడ్డారు. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి వీరేశం, ఉపాధ్యక్షుడు ధనరాజ్‌ గౌడ్‌ అధ్యక్షతన పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా కంజర్ల, శివనగర్‌ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసకావడంతో రోడ్డు బాగు చేయాలని బీజేపీ శ్రేణులతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, రోడ్డు బాగు చేయాలన్నారు. ధ్వంసమైన రోడ్డుతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌, నియోజకవర్గ కన్వీనర్‌ శ్రీనివాస్‌గుప్తా, కన్వీనర్‌ నర్సింగ్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాల్గొన్నారు.